సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 27 । జూన్ । 2025



లారీని ఢీకొట్టిన కారు

ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. - 8లో



గంజాయి విక్రేతల అరెస్ట్

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున దంపతులతో పాటు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు 'బెస్ట్ అవైలబుల్' లక్కీ డ్రా

భువనగిరిటౌన్ : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించనున్నారు. భువనగిరిలోని కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు డ్రా తీయనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జినుకల శ్యాం సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఒకటో తరగతి(నాన్ రెసిడెన్షియల్), ఐదవ తరగతి(రెసిడెన్షియల్)లో ప్రవేశాలు కల్పించనున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో డ్రా తీయనున్నారని, 10:30 గంటలలోపు హాజరు కావాలని పేర్కొన్నారు.

వైద్యాధికారి సంతకం ఫోర్జరీపై విచారణ



విచారణ చేస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: మండల వైద్యాధికారి సంతకం ఫోర్జరీపై ఆర్డీఓ శేఖర్‌రెడ్డి గురువారం సమగ్ర విచారణ నిర్వహించారు. అందులో భాగంగా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని భూభారతి కంప్యూటర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కళ్యాణలక్ష్మి పథకం దరఖాస్తుదారులకు గెజిటెడ్ సంతకం అవసరం కావడంతో కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు అక్రమ బాగోతానికి తెరలేపారు. నకిలీ స్టాంపులు తయారు చేసి, వైద్యాధికారి రవీనా సంతకం ఫోర్జరీ చేసి కొంతకాలంగా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి దరఖాస్తులను పరిశీలిస్తున్న క్రమంలో వైద్యాధికారి సంతకాలు తేడా ఉన్నట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. వైద్యాధికారి ఫిర్యాదు మేరకు ఆర్డీఓ విచారణ చేశారు. ఫోర్జరీ సంతకాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గడిచిన రెండేళ్లుగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందిన వారు ఒరిజినలా, కాదా చెక్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో భక్తులచే అష్టోత్తర పూజలు జరిపించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బాలలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

భువనగిరి : బాలలను వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత ఆదేశించారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 2,430 చిన్నారులు వికలత్వం కలిగి ఉన్నారని, వీరికోసం గ్రామాల్లో పల్స్‌పోలియో క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. . సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు బండారు జయశ్రీ, సభ్యులు నరసింహారావు, రుద్రమదేవి, శివరాజు, ఇస్తారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, డీసీపీఓ తదితరులు పాల్గొన్నారు.

మత్తు వీడితేనే భవిష్యత్



భువనగిరిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, ఉద్యోగులు

భువనగిరి : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించి మాట్లాడారు. మత్తు.. జీవితాన్ని చిత్తు చేస్తుందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వినాయకచౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని, మున్సిపల్ కమిషనర్ రామలింగం, ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు!

- పర్మిట్లకు మించి తవ్వకాలు.. రాయి, కంకర తరలింపు
- అధికారులు, సిబ్బంది అండదండలు
- స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా బేఖాతరు
- లోకాయుక్త ఆదేశాలతో కదిలిన ప్రత్యేక బృందాలు
- బొమ్మలరామారం మండలంలోని క్వారీల్లో తనిఖీలు
- నేడు మరికొన్ని చోట్ల..

రాయి క్వారీల్లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన



భువనగిరి బైపాస్ రోడ్డు పక్కన క్వారీలో తవ్వకాలు చేపట్టి పూడ్చకుండా వదిలేసిన దృశ్యం

సాక్షి,యాదాద్రి : ఆలేరు మండలం శ్రీనివాసపురంలో ఇద్దరు.. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్‌లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి.. ఇటువంటి ఘటనలు మరెన్నో. రాయి క్వారీల యజమానులు నిబంధనలకు పాతరేస్తూ మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పర్మిట్‌లకు మించి తవ్వకాలు చేపడుతూ పర్యావరణానికీ హాని తలపెడుతున్నారు. స్థానికులు క్వారీల నిర్వాహకుల అక్రమాలపై గనుల శాఖ అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించారు. లోకాయుక్త ఆదేశాలతో ప్రత్యేక అధికారుల బృందం రంగంలోకి దిగింది. గురువారం బొమ్మలరామారం మండలంలోని పలు క్వారీల్లో తనిఖీలు నిర్వహించింది.

కరిగిపోతున్న రాతిగుట్టలు

స్టోన్ క్రషర్లకు జిల్లాలో 60 క్వారీల్లో అనుమతులు ఉన్నాయి. ఈ క్వారీల్లో బిల్డింగ్ స్టోన్, రోడ్డు మెటల్‌తో పాటు బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ తవ్వకాలు జరుపుతున్నారు. రాజధానికి శివారున ఉండడంతో నిర్మాణ రంగం, రోడ్ల నిర్మాణానికి కంకర, ఇతర అవసరాలకు ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున కంకర, రాయి, ఇతర గ్రానైట్ తరలిపోతుంది. అనుమతి పొందిన వ్యక్తులు నిబంధనల ప్రకారం క్యూబిక్ మీటర్ చొప్పున రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ, రాయల్టీ ఎగవేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. భువనగిరి, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, ఆలేరు, బొమ్మలరామారం, రామన్నపేట, రాజాపేట మండలాల పరిధిలో పెద్ద ఎత్తున కంకర మిల్లులు ఉన్నాయి.

విస్తీర్ణానికి మించి తవ్వకాలు

క్వారీల్లో తవ్వకాలకు అనుమతి పొందిన క్రషర్ల యజమానులు నిబంధనలు పట్టించుకోవడం లేదు. రెండు ఎకరాల విస్తీర్ణానికి అనుమతి పొంది.. క్రమంగా పరిధి దాటి గుట్టలను ధ్వంసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా 100 అడుగుల లోతుకు తవ్వకాలు చేపడుతున్నారు. ఇందు కోసం భారీ పేలుడు పదార్థాలు వినియోగించి బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. క్వారీల్లో నిషేధిత పేలుడు పదార్థాలను బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు. శబ్దానికి సమీప గ్రామాల్లో ఇళ్లు కూలిపోవడం, గోడలకు పగుళ్లు ఏర్పడటం జరుగుతుంది. భరించలేని శబ్దం వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. బ్లాస్టింగ్‌లకు రాళ్లు ఎగిరివచ్చి వ్యవసాయ భూముల్లో పడటం, అక్కడి నుంచే వెళ్లే రైతులపై పడి గాయపడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో క్వారీల చుట్టుపక్క ప్రాంతాల రైతులు సేద్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది.హైదరాబాద్ కషాయిగూడ కేంద్రంగా బినామీ పేర్లపై పేలుడు పదార్థాల రవాణా జరుగుతుందన్న ఫిర్యాదులు ఉన్నాయి.



దేశ్‌ముఖ్ వద్ద చెరువులా మారిన క్వారీ గుంత



బొమ్మలరామారం మండలం పెద్దపర్వతాపురంలో ఆనవాళ్లు కోల్పోయిన గుట్టలు

"అధికారులు స్పందించకపోవడంతో లోకాయుక్తకు ఫిర్యాదు

బొమ్మలరామారం మండలంలో చట్టవిరుద్ధంగా క్వారీలు నడుస్తున్నాయి. క్రషర్ల యజమానులు క్వారీల అనుమతి పొంది నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు చేయడంతో పాటు పరిధి దాటడం, లోతుగా తవ్వకాలు చేస్తున్నారు. దీంతో మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. శబ్ద, వాయు కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటుంది. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం జరిగింది.

–మైలారం జంగయ్య, బొమ్మలరామారం

ఆరుగురు డాక్టర్లకు ఒక్కరే..



పేషెంట్ సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

- రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు
- ఐదుగురు డాక్టర్లు గైర్హాజరవడంతో ఆగ్రహం

రామన్నపేట: కలెక్టర్ హనుమంతరావు గురువారం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆరుగురు డాక్టర్లకు గాను ఒక్కరే డ్యూటీలో ఉండటం, మిగతా ఐదుగురు ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వైద్యుల్లో ఒకరితో కలెక్టర్ నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. విధులకు హాజరుకాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం పారా మెడికల్ సిబ్బందితో సమావేశం అయ్యారు. సేవా దృక్పథంతో పనిచేసి ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలని సూచించారు. వార్డుల్లో పర్యటించి రోగులను పలకరించి వైద్యసేవలపై ఆరా తీశారు.

మెమోలు జారీ చేస్తాం

విధులకు గైర్హాజరైన డాక్టర్లకు 24 గంటల్లో మెమోలు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వారి ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఆస్పత్రిలో సమస్యలు ఉన్నాయని, పరిస్థితి మెరుగుపడే వరకు తనిఖీలు కొనసాగుతాయన్నారు.

భవిష్యత్‌లో స్థిరపడే వరకు అండగా ఉంటా

- భరత్‌చంద్రచారికి కలెక్టర్ భరోసా

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని శేరిగూడెం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి భరత్‌చంద్రచారి ఇంటిని గురువారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించి రూ.5వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. భరత్‌చంద్రచారి పదో తరగతిలో ఉండగా కలెక్టర్ అతడిని దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. గతంలో ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ విద్యార్థి ఇంటికి చేరుకుని ఇంటర్ ఎలా చదువుతున్నావు అంటూ ఆరా తీశారు. ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్‌లో స్థిరపడే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూభారతిలో వచ్చిన దరఖాస్తులతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. పోలీస్ బెటాలియన్‌లో భూములు కోల్పోతున్న రైతులు కలెక్టర్‌కు కలిసి తమ భూములు తీసుకోవద్దని విన్నవించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



భరత్‌చంద్రచారి నోట్‌బుక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సృజనాత్మకతకు 'ఇన్‌స్పైర్ మనక్'

- సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10వేలు
- కొత్తగా ఇంటర్ విద్యార్థులకు అవకాశం



భువనగిరి : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల ఆలోచనలను పరిశోధన, వైజ్ఞానిక రంగాల వైపు మరల్చడానికి నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. సమస్యకు కొత్తగా శాస్త్రీయ పరిష్కారం కనుక్కునేలా పిల్లలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా దీన్ని ప్రతి సంవత్సరం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. 2025–26 విద్యా సంవత్సరానికి దేశ వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల నుంచి ఈనెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది. అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈవిద్యా సంవత్సరం నుంచి కొత్తగా ఇంటర్‌కు అవకాశం కల్పించారు.

మూడేళ్లుగా ఎంపికైన ప్రాజెక్టులు	
2022-23	126
2023-24	131
2024-25	81

నమోదు ఇలా ..

www.inspireawards.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. పాఠశాల వివరాలు నమోదు ఎంటర్ చేయాలి. దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది. వారి ఆమోదం తర్వాత విద్యార్థి మెయిల్‌కు యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. అప్పుడు యూజర్‌ఐడీకి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. విద్యార్థి తన సమాచారంతో పాటు బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లు నమోదు చేయాలి. విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టును సంక్షిప్తంగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.

ఈ అంశాలపై..

స్థానిక సమస్యలు, ప్రస్తుతం సవాలుగా ఉన్న సమస్యలకు పరిష్కారం కనుక్కునేలా పరికరాల రూపకల్పన ఉండాలి. ప్రతి పాఠశాల నుంచి గైడ్ టీచర్‌తో పాటు విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంటుంది. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రోత్సాహకాలు ఇలా..

ప్రాజెక్టులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పరిశీలిస్తారు. ఎంపికై న ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం ఎంపిక చేసిన విద్యార్థి వ్యక్తిగత ఖాతాలో రూ.10వేలు జమ చేస్తారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైతే రూ.25వేలు, జాతీయ స్థాయికి ఎంపికైతే రూ. 40వేల నుంచి రూ. 60వేల వరకు నగదు ప్రదానం చేస్తారు, అవార్డును రాష్ట్రపతి చేతుల మీదగా అందజేస్తారు. ప్రతిభావంతులకు ఐఐటీ, నీట్‌లో ప్రవేశం కల్పిస్తారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



స్థానిక సమస్యలు, ప్రస్తుత సమస్యలను దృష్టిలో పెట్టుకుని వాటికి పరిష్కారం కనుగొనేలా ప్రాజెక్టులు ఉండాలి. ఎగ్జిబిట్లు రూపొందించేలా విద్యార్థులను సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. జిల్లాతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులకు ఎంపికయ్యేలా ప్రాజెక్టు రూపకల్పనకు ఆలోచనలు చేయాలి.

– పులిమామిడి రాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి

చెరువులను అనుసంధానం చేయాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాగునీటి ప్రాజెక్టులపై మ్యాప్ ద్వారా సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : మునుగోడు నియోజకవర్గంలోని అన్ని చెరువులను శివన్నగూడెం రిజర్వాయర్‌తో అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. నీటి పారుదల ప్రాజెక్టులపై గురువారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు నీటిని తరలించే పనులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ రెండు మండలాలకు కచ్చితంగా నీటిని అందజేయాలని, అందుకోసం డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మునుగోడు నియోజకవర్గంలోని 148 చెరువులను భవిష్యత్‌కు అనుగుణంగా తీర్చిదిద్దాలని, పూడిక తీయడం, చెట్లు తొలగించడం, కట్టలు, అలుగులను పటిష్టం చేయడం వంటి పనులకు ఎంత ఖర్చవుతుందో డీపీఆర్ తయారు చేయాలని సూచించారు. కరువుకు నిలయమైన మునుగోడు నియోజకవర్గంలో భవిష్యత్‌లో నీటి కరువు లేకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలన్నారు. సమావేశంలో మర్రిగూడ ఈఈ రాములు, చౌటుప్పల్ డీఈ మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంస్థాన్ నారాయణపురం : ఆయిల్‌పామ్‌తో లాభాలు అధికమని జిల్లా ఉద్యాన అధికారి కవిత, తెలంగాణ ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి ఖాజా మొయినుద్దీన్ అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో గురువారం బద్దం మహేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా పెసర, పత్తి, మిర్చి, బొప్పాయి వేరుశనగ పంటలను సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వర్షిత, ఏఈఓలు సైదులు, శివకుమార్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు తనిఖీలకెళ్తే.. బోధనెలా!

- పాఠశాలల తనిఖీ బాధ్యతలపై వ్యతిరేకత
- విద్యాశాఖ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం



భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో తనిఖీలు చేయించాలన్న విద్యాశాఖ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లతో బదుల్లో తనిఖీలు చేయించడమేమిటని.. ఎంఈఓలు, గెజిటెడ్ హెచ్‌ఎంలు ఏం చేయాలని ప్రశ్నిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయనే భావన తల్లిదండ్రుల్లో నెలకొంది. దీంతో తమ పిల్లలను ప్రైవేట్‌కు స్కూళ్లకు పంపేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే పాఠశాలలను తనిఖీ చేసే బాధ్యత ఉపాధ్యాయులకు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు.

అనుభవజ్ఞులకు బాధ్యతలు

కమిటీ నియమించిన పదేళ్ల అనుభవం ఉన్న ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు లేదా ఎస్జీటీలు రోజుకు రెండు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేయాలి. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో పదేళ్ల బోధన అనుభవం కలిగిన స్కూల్ అసిస్టెంట్ రోజుకు రెండు స్కూళ్లు తనిఖీ చేయాలి. ఉన్నత పాఠశాలల్లో పదేళ్ల అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్ రోజుకు ఒకటి చొప్పున 3 నెలల్లో 50 పాఠశాలలను తనిఖీ చేయాలి.

మండలానికి ముగ్గురు చొప్పున

విద్యాశాఖ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.ఇప్పటికే స్కూల్ కాంప్లెక్స్, హెచ్‌ఎంలు, ఎంఈఓలు, సీఆర్‌పీలు ఉన్నారు. జీహెచ్‌ఎంల పర్యవేక్షణలో ఉన్నత పాఠశాలను తనిఖీ చేయడం సరైంది కాదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. తనిఖీ సమయంలో హెచ్‌ఎంలు సహకరిస్తారా లేదా తెలియని పరిస్థితిగా మారింది. మండలానికి ముగ్గురు చొప్పున నియమించడం వల్ల జిల్లాలో 51 మంది ఉపాధ్యాయులు పాఠశాలలకు దూరం కానున్నారు. ప్రస్తుతం ఒక్క రెగ్యులర్ ఎంఈఓ లేడు. జీహెచ్‌ఎంలు ఇంచార్జి ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బోధనపై ప్రభావం పడుతుంది



ఇప్పటికే ప్రతి నెలా ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ అవుతున్నారు. దీని వల్ల ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ఉన్న ఉపాధ్యాయుల్లో కొందరికి తనిఖీల బాధ్యతలు అప్పగించడం వల్ల బోధనపై ప్రభావం పడుతుంది. ఎంఈఓల పోస్టులను భర్తీ చేసి వారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలి.

–ఎస్.లక్ష్మీనరసింహారెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులు నష్టపోతారు



ఉపాధ్యాయులకు పాఠశాలల తనిఖీల బాధ్యతలు అప్పగించడం వల్ల బోధనపై దృష్టి సారించే పరిస్థితి ఉండదు. దీని వల్ల విద్యార్థులు నష్టపోతారు. పూర్తిస్థాయి ఎంఈఓలను నియమించి వారికే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తే బాగుటుంది. వారికి హెచ్‌ఎంలు కూడా సహకరిస్తారు. నిర్ణయాన్ని విద్యాశాఖ ఉపసంహరించుకోవాలి.

–రేపాక ఉమ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు

ప్రభుత్వం పునరాలోచించాలి



ఉపాధ్యాయులకు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం వల్ల కొరత ఏర్పడుతుంది. సకాలంలో సిలబస్ పూర్తి చేయడం కష్టమవుతుంది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఇదే సమయంలో ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి పాఠశాలలకు దూరం చేయడం సరికాదు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

–మెతుకు సైదులు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

అడ్డగూడూరు: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం ధర్మారంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం కోటమర్తికి చెందిన బురుగుల సోమయ్య (42), యాదమ్మ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. సోమయ్య మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో యాదమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి ధర్మారం గ్రామానికి వచ్చి తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. నెల క్రితం కుమారుడి నిశ్చితార్థం ఉండడంతో సోమయ్య ధర్మారంలో ఉంటున్న భార్య, పిల్లల వద్దకు వచ్చాడు. 15రోజులు అక్కడే ఉన్నాడు. ఆ తర్వాత భార్యతో గొడవపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ధర్మారం గ్రామంలో తల్లిగారి ఇంటి వద్ద ఉంటున్న యాదమ్మ బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రించింది. గురువారం తెల్లవారుజామున ఆమె నిద్ర లేచి చూసేసరికి ఇంట్లో ఉన్న జామచెట్టుకు సోమయ్య చీరతో ఉరేసుకుని కనిపించాడు. ఇరుగు పొరుగు వారు వచ్చి చూసేసరికి సోమయ్య మృతిచెందాడు. కుటుంబ కలహాలతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి

భువనగిరి: రోడ్డు దాటుతున్న వ్యక్తి ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన మహ్మద్ జహంగీర్(52) పట్టణ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ దాబాలో పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న నార్కట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి రోడ్డు దాటుతున్న జహంగీర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జహంగీర్‌ను స్థానికులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి భార్య అజ్మీరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

పెద్దఅడిశర్లపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఘనపురం గ్రామ స్టేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన జ్యోతయ్య(62) గురువారం రాత్రి ఘణపురం గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. గ్రామ స్టేజీ సమీపంలో గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ దుర్మరణం
- మరో హెడ్ కానిస్టేబుల్, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- కేసు విచారణ నిమిత్తం కోనసీమ జిల్లా అలమూరు స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం
- సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద ఘటన


కారులో ఇరుక్కున్న మృతదేహాలను బటయకు తీస్తున్న కోదాడ పోలీసులు


మృతదేహాలకు నివాళులర్పిస్తున్న కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ, కోదాడ డీఎస్పీ


ముద్దాల అశోక్, ఎస్ఐ (ఫైల్)


బ్లెసీన్ జీవన్, కానిస్టేబుల్ (ఫైల్)

కోదాడరూరల్: కోదాడ వద్ద జరిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. మరో హెడ్‌కానిస్టేబుల్, కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం జంక్షన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. ఏపీలోని కోనసీమ జిల్లా అలమూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ముద్దాల అశోక్(43), అదే స్టేషన్‌లో ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యస్వామితో పాటు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుంకర బ్లెసీన్ జీవన్(31) కలిసి గంజాయి కేసులో నిందితులను పట్టుకునేందుకు ఎర్టిగా కారులో డ్రైవర్ రమేష్‌తో కలిసి బుధవారం రాత్రి 10గంటల సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో డ్రైవర్‌కు నిద్రవస్తుందని చెప్పడంతో అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఏపీ వైపు గంటన్నరపాటు కారు పక్కకు ఆపి నిద్రించారు.

బయల్దేరిన 10 నిమిషాలకే..

కొద్దిసేపటి తర్వాత వీరు తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరగా.. ఆ తర్వాత పది నిమిషాలకే కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం జంక్షన్‌లో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారుతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ బ్లెసీన్ జీవన్ అక్కడికక్కడే మృతిచెందారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యస్వామి, డ్రైవర్ రమేష్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కోదాడ పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కారులో ఇరుక్కుపోయిన ఎస్ఐ మృతదేహం

లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు భాగంలో కూర్చున్న ఎస్ఐ మృతదేహం అందులో ఇరుక్కుపోయింది. కోదాడ పోలీసులు కారు భాగాలను తొలగించి అతికష్టం మీద ఎస్ఐ మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్ఐ అశోక్‌ది ఏపీలోని నరసాపురం అని, 2009 బ్యాచ్‌లో ఎస్ఐగా ఎంపికయ్యాడని, త్వరలోనే సీఐ ప్రమోషన్ రానుందని ఘటనా స్థలానికి వచ్చిన ఆయన స్నేహితులు తెలిపారు. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కానిస్టేబుల్ బ్లెసీన్ జీవన్ అవివాహితుడు. ఈ ఘటన తర్వాత లారీతో సహా డ్రైవర్ పరారయ్యాడు. అయితే పోలీసులు లారీని పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నివాళులర్పించిన కోనసీమ అడిషనల్ ఎస్పీ, కోదాడ డీఎస్పీ

కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఎస్ఐ, కానిస్టేబుల్ మృతదేహాలకు కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను ఏపీ పోలీసులకు అప్పగించారు. క్షతగాత్రుడు హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తెలిపారు.

నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యం

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి


మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్: నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అవాంతరాలను అధిగమిస్తూ విజయపథంలో ముందుకుసాగాలని సూచించారు. మానవీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ సాధనలో తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం ఉచిత పోటీ పరీక్షల శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి, మెంటారింగ్ ద్వారా సివిల్స్‌పై అవగాహన పెంచేందుకు 12 అంశాల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ శిక్షణ 3 సంవత్సరాల పాటు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ప్రదీప్, భవానీ శంకర్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి, కె. అరుణప్రియ, ప్రేమ్‌సాగర్, డాక్టర్ మద్దిలేటి, లక్ష్మీప్రభ, అనితా కుమారి, ఇందిర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంజీయూలో పరికరాల ప్రదర్శన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆవిష్కరించిన పరికరాలను శుక్రవారం యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రదర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు. గురువారం వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రవి, రేఖ, జయంతి పాల్గొన్నారు.

రైతులను మోసం చేసి సంబురాలా..?

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


నీర్నెముల గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: రైతు రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంబురాలు చేసుకోవడమేమిటని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. గురువారం రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న ఆయన నీర్నెముల గ్రామంలో మహిళలతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పదకొండు పర్యాయాలు రూ.75వేల కోట్లు రైతుబంధు పేరుతో రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి పంటకు ఎకరాకు రూ.5వేలు మాత్రమే ఇచ్చాడని, రెండో పంటకు పూర్తిగా ఎగ్గొట్టి, మూడో పంటకు నాలుగెకరాల వరకు కూడా రైతు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. రూ.2లక్షల లోపు పంట రుణం ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగలేదని, రూ.2లక్షలకు పైగా రుణం రైతులు డబ్బులను బ్యాంకులకు చెల్లించి రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఆత్మీయ భరోసాకు కొర్రీలు పెట్టారని, సబ్సిడీ గ్యాస్ ఇవ్వడం లేదని, తులం బంగారం ఊసేలేదని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మహిళలకు నెలకు రూ.2500 ఆర్థికసాయం అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అంతకుముందు ఆయన లక్ష్మాపురంలో ఇటీవల మృతిచెందిన నీల స్వామి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు పోచబోయిన మల్లేశం, బత్తుల శంకరయ్య, కొమ్మంపాటి శ్రీనివాస్, సాల్వేరు అశోక్, ఎస్‌కే చాంద్, ఎండీ అమేర్, బత్తుల వెంకటేశం, పులిపలుపుల వీరస్వామి, కొయ్యగూరి వెంకన్న, జాడ సంతోష్, బత్తిని మహేష్, ముక్కాముల సత్తయ్య, కుమార్ తదితరులు ఉన్నారు

పాముకాటుతో వృద్ధురాలి మృతి


చంద్రమ్మ (ఫైల్)

రామన్నపేట: పాముకాటుకు గురై వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన గురువారం రామన్నపేట మండలం బోగారంలో జరిగింది. బోగారం గ్రామానికి చెందిన గట్టు చంద్రమ్మ(75) తన ఇంటి పక్కన పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా పాము కాటు వేసింది. ఆమె అరుపులు విని చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే ఆమెను రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కులో చోరీ

- గార్మెంటరీ షెడ్‌లో 35 కుట్టుమిషన్లు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు


కుట్టుమిషన్లు ఎత్తుకెళ్లిన దుండగులు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని టెక్స్‌టైల్ పార్కులోని ఓ గార్మెంటరీ షెడ్‌లో గురువారం కుట్టు మిషన్లు చోరీకి గురయ్యాయి. వివరాలు.. చోడవరపు చిట్టిబాబు కరోనా వరకు టెక్స్‌టైల్ పార్కులో గార్మెంటరీ షెడ్ నిర్వహించాడు. కరోనా కాలంలో షెడ్‌ను మూసివేశాడు. ఇటీవల తిరిగి గార్మెంటరీ షెడ్‌ను తెరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో వారానికి ఒకసారి వచ్చి షెడ్‌ను చూసుకుని వెళ్తుంటాడు. వారం క్రితం గార్మెంటరీ షెడ్‌లోని ఉన్న బట్టలను తీసుకుని వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా అందులో ఉన్న 35 కుట్టు మిషన్లు కనిపించలేదు. వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.35వేలు ఉంటుందని నిర్వాహకుడు చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. నాలుగు నెలల క్రితం టెక్స్‌టైల్ పార్కులోనే వేరొక గార్మెంటరీ షెడ్ వద్ద ఇనుప స్తంభాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- అతడి కుమార్తెకు గాయాలు


సత్తయ్య (ఫైల్)

కనగల్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. అతడి కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ ఘటన కనగల్ మండలం బోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామ స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పల్లె బోయిన సత్తయ్య(43) రెండో కుమార్తె కావ్య బుధవారం సూర్యాపేటలో పరీక్ష రాసి రాత్రి 7గంటల సమయంలో కనగల్ బస్టాండ్‌కు వచ్చింది. ఆమెను ఆమెను సత్తయ్య బైక్‌పై ఎక్కించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా.. కుమ్మరిగూడెం గ్రామ స్టేజీ వద్ద చండూరు మండలం తాస్కానిగూడెం గ్రామానికి చెందిన వంగూరి బిక్షం వేగంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్తయ్య బైక్ పైనుంచి కిందపడగా అతడిపై మీద నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ వెనుక కూర్చున్న కావ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే సత్తయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం సత్తయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లంచం డిమాండ్.. పంచాయతీ కార్యదర్శి అరెస్ట్


పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్

పెన్‌పహాడ్: బొగ్గు బట్టీ నిర్వహణకు అనుమతి ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. నల్లగొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన వ్యక్తి బొగ్గు బట్టీ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనంతుల సతీష్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి రూ. 15వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత డబ్బు ఇవ్వలేనని, బతుకుదెరువు కోసం బొగ్గు బట్టీ పెట్టుకుంటున్నానని చెప్పినప్పటికీ కార్యదర్శి అనుమతి ఇవ్వలేదు. ఈ క్రమంలో బాధితుడు రూ.8వేలు ఇస్తానని చెప్పి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తన దగ్గర ఉన్న ఆధారాలను బాధితుడు ఏసీబీ అధికారులకు ఇవ్వడంతో అధికారులు విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శి లంచం అడిగినట్లు రుజువు కావడంతో గురువారం అరెస్ట్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపారు.

లోకాయుక్త ఆధ్వర్యంలో స్టోన్ క్రషర్ మిల్లుల పరిశీలన


స్టోన్ క్రషర్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మలరామారం: మండలంలోని రామలింగంపల్లి, పెద్దపర్వతాపూర్, బొమ్మలరామారం గ్రామాల్లోని పలు స్టోన్ క్రషర్ మిల్లులను లోకాయుక్త అధికారులతో పాటు పలు శాఖల అధికారుల బృందం గురువారం పరిశీలించారు. మండలంలోని సామాజిక కార్యకర్త మైలారం జంగయ్య ఫిర్యాదు మేరకు అధికారుల బృందం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్టోన్ క్రషర్ మిల్లుల నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ అనుమతులపై ఆరా తీశారు. నిబంధనల మేరకే మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయా, ఎక్స్‌ప్లోజివ్ వినియోగం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనలు పాటిస్తున్నారా, సక్రమంగా రాయల్టీ చెల్లిస్తున్నారా లాంటి అంశాలను పరిశీలించారు. క్రషర్ మిల్లుల యాజమానులు వారి వద్ద ఉన్న అనుమతి పత్రాలను వారంలోగా తమకు సమర్పించాలన్నారు. ఏ క్రషర్ మిల్లు యజమాని ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, వారి ఇష్టానుసారంగా క్రషర్ మిల్లులు నడిపిస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందని లోకాయుక్త అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకాయుక్త సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వెంకట్‌రావ్, డీఎస్పీ విద్యాసాగర్‌రావు, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ వెంకన్న, జిల్లా మైనింగ్ అధికారి రాఘవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు, జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, మైనింగ్ డిజిటల్ సర్వేయర్ సుజాత, భువనగిరి రూరల్ సీఐ చంద్రభాను, ఎస్ఐ బుగ్గ శ్రీశైలం, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్లు, గంజాయి విక్రయదారుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న భార్యాభర్తలతో పాటు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన మేడిపల్లి పార్వతమ్మ ఈ నెల 19న గ్రామ శివారులో చింతచిగురు తెంపుతుండగా.. నల్లగొండకు చెందిన బాపట్ల వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు ఆమెను గమనించారు. అంజమ్మ రోడ్డు వెంట వచ్చే వారిని గమనిస్తుండగా.. వెంకటేశ్వర్లు పార్వతమ్మ వద్దకు వెళ్లి మాటలు కలిపి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని భార్యాభర్తలు ఇద్దరు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు కేసు నమోదు చేసి.. సీసీ కెమెరాల సహాయంతో నిందితులను గుర్తించారు. దొంగిలించిన బంగారు గొలుసును నిందితులు ముద్ద చేసి ఇంట్లో దాచి ఉంచగా.. దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న రూరల్ ఎస్ఐ సైదాబాబు, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

గంజాయి విక్రయిస్తుండగా..

శాలిగౌరారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద కొంత మంది గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం స్థానిక ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం బాలిశెట్టిగూడేనికి చెందిన మిడతపల్లి రాజేష్ కల్లు గీసేందుకు గతంలో ఒరిస్సాకు వెళ్లగా.. అక్కడ గంజాయి తాగేవారితో పరిచయం ఏర్పడి అతడు కూడా గంజాయి అలవాటుపడ్డాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో రాజేష్ కల్లుగీత వృత్తిని బంద్ చేసి హైదరాబాద్‌లో స్విగ్గీ ఇన్‌స్టా కంపెనీలో పనిచేస్తున్నాడు. వచ్చే జీతం సరిపోక సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గత సంవత్సరం నుంచి గంజాయి విక్రయిస్తున్నాడు. తన స్నేహితులు గడిపర్తి ఆకాష్, మధురాజ్, బాదిని ప్రశాంత్‌తో కలిసి ఒరిస్సాలోని బరంపురలో 6కిలోల గంజాయి కొని ఇక్కడకు తెచ్చి భాగాలు పంచుకుంటుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రశాంత్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల్లో నిందితుల నుంచి 3 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు, 2 తులాల బంగారం, 4.460 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

రుణాలపై అవగాహన పెంచాలి

- నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్


సదస్సును ప్రారంభిస్తున్న సీజీఎం ఉదయ్‌భాస్కర్

ఖమ్మం వ్యవసాయం: వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలపై రైతులతో పాటు అన్నివర్గాల వారికి అవగాహన పెంపొందించాలని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఉదయ్‌భాస్కర్ సూచించారు. ఖమ్మంలో గురువారం వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలపై ప్రాంతీయ(ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల) స్థాయి బ్యాంకర్ల అవగాహన సదస్సు నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో సీజీఎం మాట్లాడుతూ.. రుణాలు అందుబాటులో ఉన్న విషయమై రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తే సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. వివిధ రంగాల వారికి ప్రయోజనం కలిగేలా ప్రభుత్వాలు పథకాలను రూపొందించి సబ్సిడీ కల్పిస్తున్నాయని, కూరగాయల సాగు, సూక్ష్మసేద్య పరికరాలు, డ్రోన్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు రుణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై బ్యాంకర్లు విస్తృత అవగాహన కల్పించాలని సీజీఎం తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, నల్లగొండ డీసీసీబీ సీఈఓ శంకర్‌రావు, అధికారులు ఆర్య రవీంద్రన్, వినయ్‌కుమార్, సుజిత్‌కుమార్, రవీందర్‌నాయక్, పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : ‘ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల ప్రాజెక్టును ఒప్పుకోం.. దాన్ని అడ్డుకుని తీరుతాం’ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే భారతీయ జనతా పార్టీని తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు. చంద్రబాబునాయుడుకు.. బీజేపీతో పొత్తు ఉన్నంత మాత్రాన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరగదన్నారు. బనకచర్లపై కేబినెట్ సమావేశంలో చర్చించామన్నారు. ఆ మినిట్స్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీన ప్రజా భవన్‌లో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వకపోతే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కరోనా తర్వాత చాలా మంది యువత డ్రగ్స్ వైపు మళ్లడంతో దాని వాడకం పెరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చాలా మంది విద్యార్థులు దానికి బానిసలుగా మారారన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థులకు లైఫ్ టర్నింగ్ టైమ్ అని, 20 ఏళ్ల వరకు చదువు, స్పోర్ట్స్, యోగాపై దృష్టి సారించాలన్నారు.